
ప్రజాశక్తి
గురువారం 9 అక్టోబర్ 2025
5
పార్వతీపురం మన్యం



ఒక్కరోజు ఆర్‌టిసి ఆదాయం రూ. 6.44లక్షలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఈనెల 7న విజయనగరంలో జరిగిన పైడిమాంబ సిరిమాను ఉత్సవాలకు జిల్లా నుంచి వేసిన ప్రత్యేక బస్సుల ద్వారా ఒక్కరోజులో సుమారు రూ.6.44.285 ఆదాయం వచ్చిందని జిల్లా ప్రజా రవాణాధికారి పి.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం డిపో నుండి 11, పాలకొండ డిపో నుండి 11, సాలూరు డిపో నుంచి 13 ప్రత్యేక బస్సులు పార్వతీపురం- విజయనగరం మధ్య ప్రయాణించాయని అన్నారు. అధిక సంఖ్యలో ప్రయాణికులు ఆర్టిసి సేవలను వినియోగించుకున్నారని ఆయన చెప్పారు. అలాగే ప్రయాణికులు వివాహాలకు, శుభ కార్యాలకు, తీర్థ యాత్రలకు ఆర్టిసీ సేవలను ఉపయోగించు కోవచ్చని ఆయన ఆ ప్రకటన కోరారు.

పెనం నుంచి పొయ్యిలోకి!

- తాగునీటి కోసం తహతహలాడుతున్న ప్రజలు
- పదిరోజుల తర్వాత బురద నీరు సరఫరా
- పరిష్కారం కాని డంపింగ్ యార్డ్ సమస్య
- రాజకీయ గబ్బు కంపు కొడుతున్న పట్టణం
- ఎమ్మెల్యే హామీలు నీటిమూటలేనా?

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలో సామాన్య, మధ్యతరగతి ప్రజలు రక్షిత మంచినీటి కోసం తహతహలాడుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటిపోయింది. అయినా ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. గత ఆరేళ్ల గా పట్టణ ప్రజలను పీడిస్తున్న ప్రధాన సమస్యలు తాగునీటి సరఫరా, డంపింగ్ యార్డ్ ఏర్పాటు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ సమస్యలు పరిష్కారిస్తానని ఎన్నికల ముందు ప్రస్తుత ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర హామీ ఇచ్చారు. ఈ సమస్యల పరిష్కారానికి ఆయన ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీలో వైసిపి పాలకవర్గం అడ్డంకిగా ఉందని ఆయన గత కొంతకాలంగా కుంటిసాకులు చెపుతున్నారు. కానీ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు ఆయన ఏ మాత్రం కృషి చేసిన దాఖలాల్లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. ఏడాదిన్నర కాలంగా వైసిపి ప్రభుత్వ తీరు, మున్సిపల్ పాలక వర్గాన్ని రాజకీయంగా విమర్శించడమే లక్ష్యంగా ఆయన పని చేస్తున్నారు తప్ప ఇచ్చిన హామీలు అమలు కోసం చిత్తశుద్ది కనబరచడం లేదన్న చర్చ జరుగుతోంది.

తాగునీటి కోసం తహతహలాడుతున్న ప్రజలు

జిల్లా కేంద్రం, గ్రేడ్-1 మున్సిపాలిటీలో ప్రజలు రక్షిత మంచినీటి కోసం తహతహలాడుతున్నారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే మారితే తమ తలరాత మారుతుందని భావించిన జనాలను అవే సమస్యలు వెంటాడుతున్నాయి. రెండు రోజులకోసారి కూడా తాగునీరు సరఫరా చేయలేని దుస్థితిలో మున్సిపల్ యంత్రాంగం కొట్టుమిట్టాడుతోంది. గత ప్రభుత్వ హయాంలో రెండు రోజులకోసారైనా నీరు సరఫరా జరిగేది. కానీ గడచిన ఏడాదిన్నర కాలంలో నాలుగు రోజుల కోసారి కూడా తాగునీటి సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. ఒకవేళ నీరు సరఫరా చేసినా బురద నీరే సరఫరా జరుగుతుంది. గత పదిరోజులుగా భారీ వర్షాలు కారణంగా పట్టణంలో ఒక్కరోజు కూడా తాగునీటి సరఫరా చేయలేదు. పదిరోజుల తర్వాత బుధవారం బురద నీటిని సరఫరా చేశారు. దీంతో ప్రజలు లబోదిబోమంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం పట్టణ జనాభా 65వేలు. అయితే ప్రస్తుత అంచనా ప్రకారం పట్టణ జనాభా సుమారు 90వేల వరకు వుండొచ్చు. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరా చేయలేని స్థితిలో యంత్రాంగం వుంది. పట్టణ ప్రజలకు రోజుకు 8.5 మిలియన్ లీటర్ల నీరు సరఫరా చేయాల్సి ఉంది. కానీ 5 మిలియన్ లీటర్ల నీరు మాత్రమే సరఫరా చేస్తున్నారు. అది కూడా నాలుగు రోజులకోసారి సరఫరా చేస్తున్న పరిస్థితి నెలకొంది.



రాయగడ రోడ్డుపై పేరుకు పోయిన చెత్తకుప్పలు

పరిష్కారానికి నోచుకోని డంపింగ్ యార్డ్ సమస్య

పట్టణాన్ని గత కొన్నేళ్లుగా డంపింగ్ యార్డ్ సమస్య పట్టి పీడిస్తోంది. పట్టణానికి సుమారు కిలోమీటరు దూరంలో ఉన్న రాయగడ రోడ్డు పక్కన ఉన్న ప్రదేశంలో పట్టణంలోని చెత్తనంతా పడేస్తున్నారు. రోజువారీ పట్టణంలో ఉత్పత్తి అయ్యే చెత్త అక్కడ పేరుకుపోవడంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చెత్త దుర్గంధాన్ని భరించలేక నానా అవస్థలు పడుతున్నారు. పట్టణంలో రోజూ 25 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. పేరుకుపోయిన చెత్తను అక్కడ నుంచి తొలగించాలని ప్రజలు కోరుతున్నా పట్టించుకున్న నాథుడే లేరు. కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యే అనుచరులు డంపింగ్ యార్డ్ దగ్గరకు వెళ్లి త్వరలో చెత్తను తరలించడం జరుగుతుందని గొప్పలు చెప్పారు. తరుణి అసోసియేట్స్ అనే స్వచ్ఛంద సంస్థతో ఒప్పందం కుదిరిందని, త్వరలో చెత్త తరలింపు జరుగుతుందని చెప్పారు. కానీ ఇంతవరకు అది ఆచరణలో అమలు కాలేదు.

పెనం మీద నుంచి పొయ్యిలోకి..

వైసిపి ప్రభుత్వం నుంచి టిడిపి ప్రభుత్వంలోకి పరిపాలన మారినా తాము ఎదుర్కొంటున్న సమస్యలు మాత్రం అలాగే ఉన్నాయని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెనం మీద నుంచి పొయ్యిలోకి పడినట్లు వుందని జనం అభిప్రాయపడుతున్నారు. తాగునీటి సరఫరా, డంపింగ్ యార్డ్ సమస్యలే కాకుండా పట్టణంలో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. పట్టణంలోని అనేక ప్రభుత్వ చెరువులు, కాలువలు ఆక్రమణ కావడంతో భారీ వర్షాలు పడినప్పుడల్లా ప్రధాన రహదారులు చెరువుల్లా మారుతున్నాయి. వర్షపు నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో రోడ్లు జలమయమవుతున్నాయి.



కుళాయి ద్వారా వస్తున్న బురదనీరు

ఏడాదిన్నర గడుస్తున్నా..

ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఎన్నికల ముందు పట్టణ ప్రజలకు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మిగిలాయి. ఆయన ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు స్వీకరించి ఏడాదిన్నర దాటిపోయింది. ఇంతవరకు పట్టణ వాసులకు ఆయన ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా పరిష్కారానికి నోచుకోలేదు. సమయం వచ్చినప్పుడల్లా వైసిపి ప్రభుత్వ తీరును విమర్శించడమే తప్ప గడిచిన ఏడాదిన్నర కాలంలో తాను పరిష్కరించిన సమస్యల గురించి ఎక్కడా చెప్పడం లేదు. మున్సిపాలిటీని తన కనుసన్నల్లో నడిపించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి చొరవ చూపడం లేదు. వైసిపికి చెందిన మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరిపై అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించడంలో తన అవగాహన లేమిని చాటుకున్నారు. అవిశ్వాస తీర్మానం నోటీసును సరైన ఫార్మాట్‌లో ఇవ్వలేకపోవడంతో అది రద్దయింది. ఈ వ్యవహారంలో పార్టీ ప్రతిష్టతో పాటు ఆయన ప్రతిష్ట కూడా మసకబారింది. మున్సిపాలిటీ వ్యవహారాల్లో మితిమీరిన జోక్యం చేసుకుంటూ పట్టణ సమస్యల పరిష్కారానికి ఆయనే ప్రతిబంధకంగా తయారయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సమయాన్ని వృథా చేయొద్దు... బాగా చదువుకోండి

ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి

ప్రజశక్తి - కురుపాం

సమయాన్ని వృథా చేయకుండా సక్రమంగా చదువుకోవాలని ఎపి ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి విద్యార్థులకు సూచించారు. బుధవారం రాత్రి స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశా లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాల లో వంటల రుచి చూసి స్టాక్ రూములను పరిశీలించారు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో వారికి అందిస్తున్న భోజనాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల తో ఆయన మాట్లాడి ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత స్థానంలో స్థిరపడి తల్లిదండ్రులకు భరోసాగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డిడి కృష్ణవేణి పాల్గొన్నారు.

భామిని : స్థానిక ఆదర్శ పాఠశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కమిషనర్ సిహెచ్ ప్రతాపరెడ్డి బుధవారం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్నం భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో నిల్వ ఉన్న రేషన్, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. విద్యార్థులు ఉప్మాకు బదులు ఎగ్ రైస్ అందించాలని వంట సిబ్బందికి సూచించారు. మంచి శానిటేషన్ కండీషన్ లో వంటలు నిర్వహించాలని, ప్రభుత్వం సూచించిన విధంగా మెనూ అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బాబురావు మరియు పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సీతంపేట : మండలంలోని వివిధ పాఠశాలలను, అంగన్వాడీ కేంద్రాలను ఫుడ్ కమిటీ చైర్మన్ సిహెచ్ విజయ ప్రతాపరెడ్డి ఆకస్మిక తనిఖీలు చేశారు. మండలంలోని గొయిది, సీతంపేట-1, మర్రిపాడు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. అలాగే స్థానిక కెజిబివి పాఠశాల, పూతికవలస, సీతంపేట గురుకుల బాలికల కళాశాల, పాఠశాలను తనిఖీలు చేశారు. చైర్మన్‌తో పాటు సిడిపిఒ సింహాలమ్మ కెజిబివి ప్రిన్సిపాల్ మాధవి సూర్య కుమారి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక ఏకలవ్య పాఠశాల, భద్రగిరి పిటిజి పాఠశాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్ కుమార్ రెడ్డి సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు వండి పెడుతున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ప్రతిరోజు ఇస్తున్న ఆహారం వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు విద్యార్థులకు గుడ్డు, పళ్ళు ఇవ్వాలని సూచించారు.



పాలకొండ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న విజయ్ ప్రతాప్ రెడ్డి

అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పర్యటనలో ఐటిడిఎ డిడి కృష్ణవేణి, ఎంఇఒ చంద్రశేఖర్, జిసిసి మేనేజర్ రాము, తహశీల్దార్ శేఖర్, అంగన్‌వాడి, పాల్గొన్నారు.

దడ పుట్టించిన ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

పాలకొండ : మండలంలో ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి పర్యటన అధికారులకు దడ పుట్టించింది. పలు అంగన్వాడీ కేంద్రాలతో పాటు రేషన్ డిపోలు, ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి అక్కడ అమలవుతున్న మెనూ పరిశీలించారు. లోపాలను గుర్తించి అధికారులపై చర్యలకు ఆదేశించారు. నగర పంచాయతీ పరిధిలో గల ఇందిరానగర్ కాలనీలో రేషన్ డిపో తనిఖీ చేయగా అక్కడ ఉన్న సరుకులకు, రిజిస్టర్లో సరుకులకు పొంతన లేదు. డీలర్ నుంచి పొంతన లేని సమాధానం రావడంతో అసహనం వ్యక్తం చేశారు 6ఎ కేసు నమోదు చేయాలని సిఎస్‌డిటి సన్యాసిరావును ఆదేశించారు. రేషన్ డిపోలు విధిగా తనిఖీ చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. నక్కలపేట అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన ఆయన మంగళవారం వరకు 45 మంది పిల్లలకు 45 మంది హాజరైనట్లు చూపించి బుధవారం ఒక పిల్లాడు లేకపోవడంతో కేంద్రం సరిగ్గా నడవడం లేదని అన్నారు. కాలం చెల్లిన కందిపప్పు అక్కడ ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సింగన్నవలస అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించగా అక్కడా పిల్లలు లేకపోవడం రికార్డు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీ కార్యకర్తలతో పాటు సూపర్వైజర్లకు పిఒకు మెమో జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. సింగన్నవలస పాఠశాలను తనిఖీ చేయగా వంట ఒక దగ్గర, పాఠశాల మరోచోట ఉండడాన్ని గుర్తించారు ఇలా చేస్తే ఎలా అంటూ మందలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొండ నుంచి రేషన్ డిపోలో సరుకులు తూకంలో తక్కువగా వస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై దృష్టి పెట్టాలని అధికారులను సూచించారు

పర్యాటకులను ఆకర్షించడమే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని ప్రతి పర్యాటక ప్రాంతాన్ని ప్రొమోట్ చేస్తూ పర్యాటకులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యం కావాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సమన్వయ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన వీడియోలను తయారు చేసి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాల వివరాలతో పాటు అక్కడ ఉండే వసతులపై జిల్లా పర్యాటక వెబ్ సైట్ నందు నమోదు చేయాలని, ఆన్‌లైన్ ద్వారా పర్యాటక ప్రాంతాల్లోని గదులను బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించాలని కలెక్టర్ సూచించారు. పర్యాటక సీజన్ ప్రారంభం కానున్నందున ఈలోగా ఈ పనులన్నీ సిద్ధం కావాలని అన్నారు. ఇందుకోసం చేపట్టబోయే చర్యలు, ప్రారంభ తేదీలతో నివేదికను సిద్ధం చేసి తమకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో తాటిపూడి, తాడికొండ, తోణాం, దళాయివలస, మెట్టుగూడ, ఆడాలి తదితర పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తూ, పర్యాటకులు వచ్చేలా చేయడమే ప్రధాన ఉద్దేశ్యం కావాలని పేర్కొన్నారు. అయితే ఆయా ప్రాంతాలకు విచ్చేసే పర్యాటకులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయించడం, ఫుడ్ ఇతర స్టాల్స్ ఏర్పాటు చేయడం, మౌలిక వసతుల కల్పనతో పాటు హోమ్ స్టేలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పర్యాటక ప్రదేశం లోపల, వెలుపల స్టాల్స్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాల సమీపంలోని అందుబాటులో ఉన్న గృహాలను తీసుకొని హోమ్ స్టేలుగా మారుస్తూ, హోమ్ స్టేలకు అవసరమైన మంచాలు, స్నానపు గదులు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు ఉండేలా చూసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ అధీనంలో ఉన్న షాపులను గుర్తించి వాటిని స్వయం సహాయక సంఘ సభ్యులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. షాపులకు కనీస అద్దెను నిర్ణయిస్తూ, బహిరంగ వేలం ద్వారా ధరను ఖరారు చేయాలని తెలిపారు. అధిక సంఖ్యలో ఎస్‌హెచ్‌జి మహిళలు పాల్గొనేలా ప్రచారం చేయాలని, వికలాంగులకు, వృద్ధులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జలాశయాల్లో బోటింగ్ ఏర్పాట్లు చేయాలని ఇందుకు అవసరమైన అనుమతులు మంజూరు చేస్తామని కలెక్టర్ చెప్పారు. జలపాతాల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి పర్యాటక కేంద్రం వద్ద పర్యాటకులకు తెలిసేలా ప్రధాన ద్వారంతో కూడిన బోర్డులను ఏర్పాటుచేయాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సీతంపేట ఐటిడిఎ పిఒ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఎపిఒ ఎ.మురళీధర్, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి,ట్రైటిడిఎ ఇంజినీరింగ్ అధికారులు, ఎపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

పచ్చకామెర్లతో ఇద్దరే మృతి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురం

కురుపాం గురుకుల బాలికల పాఠశాలలో ఇద్దరు విద్యార్థినులు మాత్రమే పచ్చకామెర్లు లక్షణాలతో మరణించారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు చెప్పారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో ఇద్దరు పచ్చకామెర్లతో మృతి చెందినట్లు ప్రచారం జరుగుతోందని, అది అవాస్తవమని చెప్పారు. కురుపాం గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో 60మంది కోలుకున్నారని, మిగిలిన వారి ఆరోగ్యం కూడా నిలకడగా ఉందని డాక్టర్ భాస్కరరావు తెలిపారు.

సంఘం నాయుడు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ

వీరఘట్టం : మండలంలోని పాలమెట్ట గ్రామానికి చెందిన తోలాపు సంఘం నాయుడు కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరామర్శించారు. సంఘం నాయుడు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంపిపి దమలపాటి వెంకటరమణ నాయుడు, తోలాపు విశ్వనాథం నాయుడు, లక్ష్మం నాయుడు, మజ్జి పారినాయుడు, పర్రి కృష్ణ, తదితరులు ఉన్నారు.

పత్తికి విపత్తు

- అధిక వర్షాలతో పంటను పీడిస్తున్న తెగుళ్లు
- నేలపాలవుతున్న తెల్లబంగారం
- నష్టాలబారిన రైతులు



రాలిపోయిన పత్తిని ఆరబెట్టిన రైతులు

ప్రజాశక్తి - సాలూరు

ఎన్నో ఆశలతో సాగు చేసుకుని పత్తి పంట చేతికొచ్చే సమయానికి అధిక వర్షాలు నిండా ముంచేశాయి. అధిక తేమతో విజృంభిస్తున్న తెగుళ్లతో కష్టాలు నష్టాలతో రైతులు విల విలాడుతున్నారు. చెట్లపైనే కాయలు కుళ్లిపోతున్నాయి. తీసేందుకు సిద్ధంగా ఉన్న తెల్ల బంగారం నేలపాలైంది. నేల పడిన విత్తనాలు మొలకెత్తి రంగు మారిపోవడంతో రైతు కుదేలవుతున్నాడు ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాల్లో పత్తి దిగుబడి తగ్గిపోతుందని రైతు ఆవేదనవ్యక్తం చేస్తున్నాడు.

సాలూరు నియోజకవర్గంలో ప్రధాన వాణిజ్య పంటలో ఒకటి పత్తి పంట. గత కొన్నిరోజులుగా ఏకధాటిగా ఈ ప్రాంతంలో కురుస్తున్న వర్షానికి పత్తి పంట మొగ్గ, కాయ దశలో ఉండడంతో ఈ వర్షానికి మొగ్గ, కాయలు నేలపాలవుతున్నాయి. దుక్కులు దున్ని పంటను వేసిన వాటికి ఎరువులు, కలుపు తీసుకొని నిరంతరం పంటను కాపాడుకోవడానికి రైతులు పడుతున్న కష్టం అంతా ఇంతా కాదు. ప్రస్తుతం పత్తి పంట మొగ్గ, కాయ దశలో ఉండడం ఈ వర్షాలకు అవి నేలపాలవుతున్నాయి. రైతు చూస్తుండగానే అవి పనికి రాకుండా పోవడంతో దుఃఖంతో చూడడమే తప్ప ఏమీ చేయలేని స్థితిలో ఉన్నాడు. ఎకరానికి రూ.20 నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టి వాటిని చంటి పిల్లలాడిలా చూసుకుని నిరంతరం వాటిలో కలుపు తీసుకొని ఎరువులను, మందులను పిచికారీ చేస్తూ ఎప్పటికప్పుడు వాటిని శుభ్రంగా చూసుకొని పంట చేతికి వచ్చి రూపాయి తిందామన్న సమయంలో ఇటువంటి పరిస్థితులు దాపురించడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా నిరంతరం అధిక వర్షాలు పడడంతో పంట చేలలో ముడుకులోతు నీళ్లు నిల్వ ఉండడంతో ఆ పంట పూర్తిగా పాడై ఎర్రబారిపోతుంది. దీంతో వర్షం తగ్గినా కూడా ఈ పంట పనికిరాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో ఉండే పత్తి పంటలో నీళ్లు చేరకపోయినా ఈ అధిక వర్షాలతో మొగ్గ, కాయలు కింద పడి కుళ్ళిపోతున్నాయని, దీని ద్వారా తెగుళ్లు కూడా అధికంగా వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకరాకు పది క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉన్నా అకాల వర్షాలతో మూడు నుంచి నాలుగు క్వింటాలు కూడా రాదేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుళ్లిపోయిన కాయలను తెచ్చి ఆరబెట్టి వాటిని రంగు మారిన పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి



నేను కరాసు వలస పంచాయతీ మర్లవలసలో మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేస్తున్నాను. దీంతో ప్రతి ఏటా ఎంత నష్టపోయినా ఎంతో కొంత మిగిలేదని. ఈ ఏడాది అధిక వర్షాలు, తుఫాన్లతో పంట పూర్తిగా నీటిలో ఉండి పాడైంది. దీంతో కాయలను ఎప్పటికప్పుడు ఏరి, ఎండబెట్టి వాటిని తీయగా అవి రంగు మారి ఉంటుంది. ఈ రంగు మారిన పత్తిని కొనుగోలుదారులు కొనుగోలు చేయడంలేదు. కావున పత్తిని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని కూడా అందించాలి.

బూస ఆదినారాయణ,
రైతుమర్ల వలస.



వైద్య పరీక్షల కోసం కురుపాం సిహెచ్‌సికి పోటెత్తిన ప్రజలు

పచ్చకామెర్ల కలకలం

సిహెచ్‌సికి పెరిగిన ప్రజలు తాకిడి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గురుకుల, ఏకలవ్య పాఠశాలల్లో విద్యార్థులు పచ్చకామెర్లు బారిన పడి ఇద్దరు మృతి చెందడంతో పాటు పరిసర గ్రామాల్లో మరో ఇద్దరు యువకులు మృత్యువాతపడ్డారు. సుమారు 140 మంది విద్యార్థులు కెజిహెచ్, పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఈ మేరకు బుధవారం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్య పరీక్షల కోసం క్యూ కట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన వారు మాట్లాడుతూ పచ్చకామెర్లు బారిన పడిన విద్యార్థుల తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తుండడంతో ఆ గ్రామంలో ఉన్నటువంటి తమకు కూడా ఏమైనా పచ్చకామెర్లు సోకేయేమోనని భయభ్రాంతులను గురవుతున్నామని తప్పనిసరి పరిస్థితుల్లో వైద్య పరీక్షల కోసం వచ్చామని తెలిపారు. వైద్య పరీక్షల కోసం ప్రజలు ఎక్కువమంది వస్తుండడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. కావున జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రతి గ్రామంలోనూ వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు.

మరణాలపై ప్రశ్నించిన గిరిజన నేతలపై కేసులా?

వామపక్ష ప్రజా సంఘాలు ఆగ్రహం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇటీవల కురుపాం గురుకుల విద్యార్థినుల మరణానికి కారణమైన ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోకపోగా విద్యార్థుల మరణాలు, మౌలిక సమస్యలపై ప్రశ్నించిన గిరిజన సంఘం నాయకులు కె.సీతారాం, పి.రంజిత్ కుమార్‌పై కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమని వామపక్ష ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు బివి రమణ, సిపిఐ నాయకులు ఆర్‌విఎస్ కుమార్, రైతు కూలీ సంఘం నాయకులు ఎం భాస్కరరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు రెండేళ్లు కావస్తున్నప్పటికీ ప్రభుత్వం గిరిజన , ఇతర విద్యాసంస్థల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేదన్నారు. తాగునీరు, మందులు, మరుగుదొడ్లు, దోమ తెరలు కల్పించడానికి, పారిశుధ్యం మెరుగుకు ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం వల్లే ఈ మరణాలకు కారణమని అన్నారు. ప్రభుత్వం తన తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకు ప్రశ్నించే నాయకులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని విమర్శించారు. గిరిజన ప్రజలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయలేని పార్వతీపురం ఎమ్మెల్యే గిరిజన నాయకులపై కేసులు నమోదు చేయాలని ఒత్తిడి తేవడం అత్యంత నీచమైన చర్యని అన్నారు. ఎమ్మెల్యే బోనేల విజయ్ చంద్ర కనీస పరిజ్ఞానం లేక సమస్యలు పరిష్కారానికి కృషి చేయకపోగా ఈ రకంగా ప్రజాస్వామ్య హక్కులను హరించేందుకు బహిరంగంగానే పోలీసు అధికారులను ఆదేశించడం సరైన విధానం కాదని చెప్పారు. ఎమ్మెల్యే విజయచంద్ర వైఖరి మార్చుకోవాలని సూచించారు. లేని యెడల ఆయన వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. గిరిజన విద్యార్థులు మరణాలపై కనీస సానుభూతి ప్రదర్శించకుండా సమస్యలను పరిష్కారానికి కృషి చేయకుండా తమ తప్పులను ఇతరులపై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, పార్వతీపురం ఎమ్మెల్యేకి, గిరిజన శాఖ మంత్రికి గిరిజన ప్రజల సమస్యలు పరిష్కారానికి కనీసం చిత్త శుద్ధి లేదని విమర్శించారు. ఇప్పటికైనా గిరిజన సంఘాల నేతలపై పెట్టిన కేసులను ఉపసంహరించాలని, లేనిచో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు పి.సంఘం , బి.సూరిబాబు, పి.రంజిత్ కుమార్, కె.సీతారాం తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వామపక్ష ప్రజాసంఘాల నాయకులు

జెడ్‌పి హైస్కూల్‌లో ప్రత్యేక ఆధార్ కేంద్రం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎం. సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక ఆధార్ కేంద్ర శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం, గురువారం రెండు రోజులు పాటు ఈ ఆధార కేంద్రాన్ని పోస్టల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామని, కావున విద్యార్థులు, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆధార్ కార్డులో పేర్లు తప్పులు పడిన వారు పుట్టిన తేదీలు, చేర్పులు మార్పులు సరి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకుకులు

సిజెఐపై దాడికి వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - సీతానగరం

చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా ఉందని, దాడికి పాల్పడిన లాయర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐటియు, ప్రజాసంఘాలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీతానగరంలో ప్రజాసంఘాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు మాట్లాడుతూ కోర్టులోనే సిజెఐపై బూటు విసరడం అత్యంత దిగ్భ్రాంతిని కలిగించేలా ఉందని తెలిపారు. దేశంలో బిజెపి ముఖ్యమంత్రులు, మంత్రులు, నేతలు ప్రజల మధ్య కులచిచ్చును పెంచుతున్నారని, మతోన్మాద వ్యాఖ్యలు నిరంతరం చేస్తున్నా ఎలాంటి చర్యల్లేవని, నేడు అలాంటి ఘటనలే జడ్జిపై బూటు వేసే అంత ధైర్యాన్ని కూడా తెచ్చాయని విమర్శించారు. సిజెఐ గవాయికు రక్షణ వెంటనే కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు, అసంతృప్తి తెలియజేసే హక్కుకు రక్షణ లేకపోతే అట్టడుగు వర్గాల గొంతు నొక్కేయడమే అవుతుందని, అలాంటప్పుడు రాజ్యాంగంలో ఇచ్చిన హక్కులకు విలువ ఉండదని అన్నారు. ప్రజలు, మేధావులు ఇలాంటి ఘటనలను ఖండిస్తూనే, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, ఆర్.రాము, జె.గౌరి, సిహెచ్, పోలీస్, ఆర్.సింహాచలం, పి.తిరుపతి పాల్గొన్నారు.



కల్పన తల్లిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి, జయకృష్ణ

విద్యార్థుల కుటుంబాలకు ఎమ్మెల్యేల పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన దండుసూరకు చెందిన తోయక కల్పన, కంబగూడకు చెందిన తోయక అంజలి పచ్చకామెర్లతో బాధపడుతు మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులను బుధవారం ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ విద్యార్థుల ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆర్థిక సాయం అందజేసి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ప్రజాశక్తి - బలిజిపేట

అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందంటే అది కేవలం కూటమి ప్రభుత్వం వల్లేనని డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. మండలంలోని పలగర పిఎసిఎస్ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎసిఎస్ నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి పాటు పడాలని అన్నారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే బి.విజయచంద్ర, పెదంకలాం ప్రాజెక్టు చైర్మన్ మండల పాపినాయుడు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు గొట్టపు వెంకటనాయుడు, సీనియర్ నాయకులు మజ్జి గౌరినాయుడు, శంబాన గౌరినాయుడు, పలగర పిఎసిఎస్ అధ్యక్షులు శంభాన రఘు పాల్గొన్నారు

కూలిన రేకిల్లు.. తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో మొండెంఖల్‌లో గల గడ్డి కాలనీ వీధికి చెందిన గంజాయి భాస్కరరావు రేకు ఇల్లు కూలి పెను ప్రమాదం తప్పిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు కూలిన సమయంలో తాను ఇంటి వద్ద లేకపోవడం, కుటుంబ సభ్యులకు కూడా వేరే ఊరి వెళ్లడంతో ఎవరికీ ఎటువంటి ప్రాణాపాయం జరగలేదన్నారు. తమది నిరుపేద కుటుంబమని, కూలి పనికి వెళ్తూ జీవనం సాగిస్తున్నామని కావున అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నష్టపరిహారం ఇచ్చి ఇల్లు మంజూరు అయ్యేలా చూడాలని కోరుతున్నను అన్నారు.



రోగులకు తనిఖీలు చేస్తున్న వైద్యులు

127 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రమైన వీరఘట్టంలోని సాయి నగర్ కాలనీ సమీపంలో శ్రీ సత్య సాయి బాబా సేవ మందిరంలో బుధవారం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి సౌజన్యంతో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా నేత్ర శిబిరంలో నేత్ర వైద్యాధికారి శ్రీలక్ష్మి 127 మందికి వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మందిని శస్త్ర చికిత్సల కొరకు ఎంపిక చేసి విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. అంతకుముందు శిబిరాన్ని నేత్ర వైద్యాధికారి శ్రీలక్ష్మి ప్రారంభించారు. హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్లుకోటేశ్వరరావు, ప్రశాంత్ జ్యోతిని వెలిగించారు. ఈ కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ డిజిఎం వి.రమేష్ కుమార్, క్యాంపు మేనేజర్ అప్పలరాజు, క్యాంపు కోఆర్డినేటర్ సిహెచ్ వెంకటరమణ, సత్య సాయి కమిటీ కన్వీనర్ జి.మురళీకృష్ణ, కె.సన్యాసినాయుడు, అల్లం కృష్ణ, టి.నరేష్‌తో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న హరిబాబు

గిరిజనులకు చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలోని దేవనాపురంలో బుధవారం గిరిజనులకు న్యాయ చట్టాలపై జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు అందుతాయన్నారు. న్యాయపరమైన అన్ని హక్కుల గురించి వివరించారు. బాల్యవివాహాలు వల్ల నష్టాలు గురించి వివరించారు. బాల్య వివాహం చేయించే ప్రతి ఒక్కరికీ శిక్ష తప్పదన్నారు. పిల్లల పట్ల ఎక్కువ సమయం తల్లిదండ్రులు కేటాయించడం వల్ల పిల్లలకు తల్లిదండ్రులకు అవినాభావ సంబంధం కలిగి పిల్లలు చేరువలో ఉంటారని సలహాలు ఇచ్చారు. న్యాయపరంగా ఏటువంటి సమస్యలుకైనా 15100 టోల్ ఫ్రీ నెంబర్‌ను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిడి అన్నదొర, ఎస్ఐ వై అమ్మన్‌రావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల మరణాలు బాధాకరం

ప్రజాశక్తి- సీతంపేట

మన్యం జిల్లా కురుపాం గిరిజన గురుకుల బాలికల స్కూళ్లో పిల్లలు మరణాలు చాలా బాధాకరం అని ఆదివాసి జెఎసి సీతంపేట మండల అధ్యక్షులు బిడ్డిక శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా ప్రతీ స్కూల్లో హెల్త్ వాలంటీర్స్ ఉన్నప్పటికీ గత ప్రభుత్వం హెల్త్ వాలంటీర్స్‌ను రద్దు చేసి ఆదివాసీ పిల్లల మరణాలకు కారణమైందన్నారు. హెల్త్ వాలంటీర్స్ ఉంటే ప్రాథమిక చికిత్స పిల్లలకు అందేదని అన్నారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే మొదటి సంతకం హెల్త్ వాలంటీర్స్ నియామకం పైనే అంటూ గిరిజన మంత్రి మాట్లాడిన మాటలు ఒట్టి అబద్దాలు అని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. పిల్లల మరణాలు ప్రభుత్వ హత్యలు కాదా, పిల్లలు మరణాలు ప్రభుత్వానికి బాధ్యత లేదా అని ప్రశ్నించారు. ఇప్పటి కైనా పిల్లలకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పిల్లలు ఆరోగ్యం పట్ల బాధ్యత వహించి అందరికి మెడికల్ ట్రీట్మెంట్ ఇప్పించాలని కోరారు.

కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలి

ప్రజాశక్తి సీతానగరం

పంచాయతీ కార్యదర్శులు బాధ్యతగా వ్యవహరించాలని డిఎల్‌పిఒ ఎన్ నాగభూషణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు విధులు, హక్కులు చట్టాలను వివరించారు. తమ పరిధిలో ఉండే ఆర్థిక వనరుల సేకరణ, చట్టాలు అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. స్వచ్ఛ్ ఆంధ్ర సంకల్పం కార్యక్రమాన్ని ప్రతి వారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ నాగభూషణరావు

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

మండల సమావేశంలో ఎంపిడిఒ

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో గల అన్ని పంచాయతీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకొని గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి శెట్టి శ్యామల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గత మూడు నెలలు జరిగిన అభివృద్ధి, పురోగతి భవిష్యత్తులో జరగాల్సిన అభివృద్ధిపై వివిధ శాఖల వారీగా అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ముందుగా రెవెన్యూ శాఖకు సంబంధించి రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ రెడ్డి పకీరు నాయుడు మండలంలో 99 రెవెన్యూ గ్రామాలకు గానూ 29 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. మూడో దశ రీసర్వేలో భాగంగా నాలుగు గ్రామాల్లో రీసర్వే ఇటీవల ప్రారంభించినట్లు తెలిపారు. గతంలో జరిగిన రీసర్వే భూముల నమోదులో తప్పిదాలను గుర్తించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారని తెలిపారు. తోడుము సర్పంచ్ ఏగిరెడ్డి సింహాచలం నాయుడు, దళాయిపేట ఎంపిటిసి సురేష్ మాట్లాడుతూ రీసర్వే జరిగిన తప్పిదాలు కారణంగా పంట నష్టపరిహారాలు, కౌలు కార్డులు ఇచ్చేందుకు అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో తుఫాన్ నేపథ్యంలో నష్టపోయిన పంటలను నమోదు చేసేందుకు ఆన్లైన్లో భూములు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అధికారుల దృష్టిలో పెట్టారు. తక్షణమే రైతులకు సంబంధించిన భూముల్లో జరిగిన తప్పిదాలను గుర్తించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. దళాయిపేట పంచాయతీలో కౌలు గుర్తింపు కార్డులో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ మల్లికార్జునరావు

ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎంపిటిసి సభ్యులు తెలిపారు. వనకాబడి రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న భూములను పవర్ ప్లాంట్‌కు ఏ విధంగా అమ్మకాలు చేశారని చినఖేర్జల సర్పంచి గంగాధర్ ప్రశ్నించారు. పవర్ ప్లాంట్‌కు అమ్మకాలు చేయకుండా తీసుకున్న భూములపై రెండుసార్లు ఈ వర్గాలకు నోటీసులు ఇచ్చినప్పటికీ గిరిజనులు మాత్రమే కార్యాలయానికి వస్తున్నారు తప్ప భూములు కొనుగోలు చేసిన వారు రాకపోవడం దారుణమన్నారు. అనంతరం వివిధ శాఖ అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి కె.అన్నపూర్ణ, మండల పరిషత్ కార్యాలయియెఒ రమేష్, వివిధ మండల స్థాయి అధికారులు, సొసైటీ అధ్యక్షులు జి.సుదర్శన్ రావు, పి.కుమారి, ఎంపిటిసి సభ్యులు డి.వెంకటనాయుడు, జి.వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.



బొడ్డగూడలో స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్న వాస్సన్ సంస్థ ప్రతినిధులు

బొడ్డగూడలో స్వచ్ఛాంధ్ర

ప్రజాశక్తి-భామిని

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాస్సన్ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ కల్యాణ్ పాత్రో అన్నారు. ఈ మేరకు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ (పరివర్తన) కార్యక్రమంలో భాగంగా బొడ్డగూడలో వాస్సన్ టీమ్ సభ్యులు, గ్రామ యువత ఆధ్వర్యాన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముందుగా నివాస పరిసరాల్లో నిల్వ ఉండే చెత్త చెదారాన్ని తొలగించి బ్లీచింగ్ వేసి శుభ్రపరిచారు. అనంతరం స్థానిక పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులతో స్వచ్ఛ భారత్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతి సందర్భంగా గ్రామాల్లో స్వచ్ఛ భారత్ చేపట్టేందుకు సంస్థ స్వచందంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఒక్కరూ మన పరిసరాలను పరి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సింగన్న, వాసన్ టీమ్ సభ్యులు మొదలవలస రమణబాబు, కూన మనోజ్ కుమార్, ఉదయ్, శివ, జగదీష్, కీర్తి రాయి సుగ్రీవులు, లోకనాథం, సింహాచలం, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శపాఠశాలకు జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డు

స్థానిక ఆదర్శ పాఠశాలకు జిల్లా స్థాయిలో మొదటి స్వచ్ఛంద అవార్డు వచ్చిందని పాఠశాల ప్రిన్సిపల్ బాబురావు బుధవారం తెలిపారు. ఆదర్శ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఈ అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించే కార్యక్రమం నిర్వహించడం వల్ల ఈ అవార్డు లభించిందని ప్రిన్సిపల్ తెలిపారు. ఇదే స్ఫూర్తితో స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన కలిగిస్తామని ఆయన తెలిపారు.



మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

పాలకొండలో ఈనెల 16 జరగనున్న 3వ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు మధుసూదనరావు రైతులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో రైతులతో కలిసి జిల్లా మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలు బుధవారం విడుదల చేశారు. అనంతరం మధుసూదనరావు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేదని, రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించే పరిస్థితి లేదన్నారు. తుఫాను వచ్చే సందర్భంలో రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించే పరిస్థితి లేదన్నారు. ముఖ్యంగా రైతులకు ఇబ్బందికరమైన నాలుగు నల్ల సాగు చట్టాలు రద్దు చేయాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలపైనా రాబోయే రోజుల్లో జరిగే ఆందోళనలో రైతులు పాల్గొనేలాగా జిల్లా మహాసభల్లో తీర్మానాలు చేయడం జరుగుతుందని తెలిపారు. కావున ఈనెల 16న జరుగు మహాసభలకు రైతులంతా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివునినాయుడు, అక్కులునాయుడు, సాయిరాం, పోలినాయుడు, అప్పలనాయుడు, స్వామి నాయుడు, శివున్నాయుడు, గౌరునాయుడు, లక్ష్మునాయుడు, రైతులు పాల్గొన్నారు.

పోడుసాగుకు వెళ్తూ ప్రాణాలు వీడి

ప్రజాశక్తి - కొమరాడ

పోడు వ్యవసాయం చేసుకుంటూ తమ కుటుంబాన్ని పోషించుకునే వ్యక్తి పై చెట్టు పడి ప్రాణాలు విడిచిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. బుదవారం మండలంలోని గుణద తీలేసు పంచాయతీ తీలేసు గ్రామానికి చెందిన పువ్వల రామారావు (47) గ్రామ సమీపంలో ఉన్న కొండపై పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజు లాగే బుధవారం పోడుకు వెళ్లి పనులు చేస్తున్న సమయంలో రామారావుపై మామిడి చెట్టు విరిగి పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు 108కు సమాచారం అందించి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెట్టు మీద పడడంతో మృతి చెందిన రామారావు

ఇంటి పెద్ద దిక్కు మృతి చెందడంతో భార్య రోదన

కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న రామారావు పిల్లలు చదువులు పెళ్లిళ్ల చేయాల్సిన సమయంలో ప్రమాద కారణంగా మృతి చెందడంతో భార్య సలామ్మ రోదన మిన్నంటింది. ప్రమాద ఘటన స్థలంలో చెట్టు కింద ఇరుక్కుపోయిన భర్త మృతదేహాన్ని చూసి భార్య రోదన చూసిన పలువురిని కంట తడికి గురిచేసింది. ఎప్పటిలాగే పోడు వ్యవసాయం చేసుకుని సాయంత్రానికి తిరిగి ఇంటికి వస్తాడన్న ఆశతో ఏదురు చూస్తున్న ముగ్గురు ఆడపిల్లలు రోదన గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు నింపింది. తండ్రి మరణ వార్త విన్న ముగ్గురు కుమార్తెలు ఒక్కసారిగా కుంగిపోయారు. పెళ్లి వయసు ఉన్న ఇద్దరు పిల్లలకు పెళ్లి చేసేందుకు సిద్ధమైన తండ్రి ఇంతలోనే చెట్టు రూపంలో మృత్యు ఒడికి చేరడంతో కుటుంబ సభ్యులంతా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆరుకాలం పోడు వ్యవసాయం చేసుకుంటూ తమ కుటుంబాన్ని పోషించుకుంటున్న రామారావు ఇక లేరు అనే వార్త వినేందుకు కూతుర్లు భార్య జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రభుత్వం రామారావు మృతుపై స్పందించి కుటుంబానికి ఏదో ఒక విధంగా ఆర్థిక సహాయం అందజేసి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

ఎన్‌పిఎం షాపు యజమానులు రైతులకు అందుబాటులో ఉండి వారి పంటల దిగుబడులు పెంచేలా సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆర్‌వైఎస్ఎస్ కన్సల్టెంట్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దత్తివలసలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ మండలాలకు చెందిన ఎన్‌పిఎం షాప్ యజమానులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా బుధవారం వివిధ రకాల కషాయలు, వృద్ధి ద్రావణాలు, జీవామృతాలు తయారీ గూర్చి ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు అదనపు ఆదాయం పొందాలంటే ఎటిఎం, ఎగ్రేడ్ మోడల్స్, పలు పంటల విధానం అంతా పాటించాలని, ప్రధాన పంటకు అయిన ఖర్చు అంతర్ పంటల వల్ల రావాలని సూచించారు. కన్సల్టెంట్ రమ ప్రభ మాట్లాడుతూ భూమిని 365 రోజులు పచ్చదనంతో ఉండాలంటే పలు రకాల పంటలు, మిశ్రమ పంటలు వేసుకోవడం వల్ల భూమిలో సేంద్రీయ కర్బన శాతం పెంచడంతో పంటల దిగుబడులతో పాటు పర్యావరణాన్ని కాపాడడం జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు అనుకూలంగా పడుతున్నందున బయో రిసోర్స్ సెంటర్స్ యజమానులు రైతులకు అందుబాటులో అన్ని రకాల కషాయాలుండేలా చేయాలని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ జి.అన్న పూర్ణ ట్రెయినర్స్ సింహాద్రి, పాపారావు రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఐటిడిఎ విద్యార్థులు

ప్రజాశక్తి - సీతంపేట

శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో బుధవారం జరిగిన ఎస్‌జిఎఫ్ క్రీడలు పోటీల్లో అండర్-14, 17 పోటీల్లో బాస్కెట్‌బాల్, క్రికెట్, వాలీబాల్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటెన్, కబడ్డీ పోటీల్లో స్థానిక ఐటిడిఎ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో అండర్ 14 వాలీబాల్ విభాగంలో శ్రీజ, జి.చాందిని ఎంపికయ్యారు. అదే పాఠశాలకు చెందిన బాస్కెట్‌బాల్ అండర్-14 విభాగంలో రామలక్ష్మి, అశ్విని, జ్యోతిశ్రీ, డి.చిత్రలోహిత, ప్రియ, పావని ఎంపికయ్యారు. అండర్-17 బాస్కెట్‌బాల్‌కు పావని, మౌనిక, పల్లవి, సమంత, రమ్యశ్రీ, రాణి, సుభాషిని, శ్రావ్య ఎంపికయ్యారు. ధోనుబాయి ఆశ్రమ పాఠశాలకు చెందిన బి.అజయ్ అండర్ క్రికెట్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలకు చెందిన సవర సావ్య అండర్ 14 కబడ్డీకి ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎపిఒ చినబాబు, డిడి అన్నదొర, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జ్ జాకబ్ దయానందం, హెచ్ఎంలు వసంత లక్ష్మి, సుకుమార్, వసతిగృహ అధికారి పాలక అమల అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు



షటిల్ బ్యాడ్మింటన్ విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

షటిల్ బ్యాడ్మింటెన్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ

కురుపాం :మండలంలోని మొండెంఖల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద బుధవారం జరిగిన మండల స్థాయి అండర్ 14,17 షటిల్ బ్యాడ్మింటెన్‌లో 10 పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కురుపాం ఆదర్శ పాఠశాల విద్యార్థులు డి.ప్రణీత్, బి.వరుణ్, సింహ చక్రి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి డివిజన్ స్థాయికి ఎంపికయ్యారు. అలాగే కబాడీ, ఖోఖో పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి డివిజన్ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల పిడి మురళి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ వి.రామలక్ష్మి, సిబ్బంది, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు విద్యార్థులకు అభినందించి డివిజన్ జిల్లా స్థాయిలో రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వాలని ఆకాంక్షించారు.

తూతూ మంత్రంగా తనిఖీలు

ప్రజాశక్తి -వీరఘట్టం

ఏదో జరిగితేనే అధికారుల్లో కదలికలు మొదలవుతాయి. ఇందుకు నిదర్శనం కురుపాం గురుకులంలో పచ్చకామెరులతో విద్యార్థుల మృతి చెందడంతో హాస్టళ్లకు, పాఠశాలలకు అధికారులు పరుగులు తీస్తున్నారు. పాఠశాలలో పరిశుభ్ర వాతావరణం ఏ విధంగా ఉందో విద్యార్థులు జ్వరాలతో ఉన్నారా? ఏ విధమైన వ్యాధులతో బాధపడుతున్నారో? ఆరా తీసి తూతు మంత్రంగా అధికారులు తనిఖీలు నిర్వహించి మామా అనిపిస్తున్నారని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. వారానికి ఒక సారైనా హాస్టళ్లకు, పాఠశాలలకు వెళ్లి మధ్యాహ్న భోజన పథకం ఏ విధంగా అమలు చేస్తున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా? లేదా అని పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యం చూపడంతో ఎక్కడా మెనూ అమలు కాకపోవడంతో పాటు రుచికరమైన ఆహారం అందించడం లేదని స్థానికులు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నారు. విద్యార్థులపై దృష్టి సారించి ఇలాంటి చర్యలు తరచూ చేపడితే ఇటువంటి ఘటనలు జరగవని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టి ఎప్పటికప్పుడు విద్యాసంస్థల్లో పర్యవేక్షణ జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

క్లాప్‌మిత్రలకు వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి -సీతానగరం

క్లాప్ మిత్రలకు బకాయిల వేతనాలు చెల్లించి వారిని ఆదుకోవాలని సిఐటియు నాయకులు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, మండల కార్యదర్శి గవర వెంకటరమణ డిమాండ్ చేశారు. స్థానిక చెత్త సంపద కేంద్రంలో బుధవారం గ్రీన్ అంబాసిడర్ల నాయకులు జలుమూరు గౌరీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం ఏడాది పాటు జీతాలు చెల్లించకుండా 10నెలలు బకాయిలు పెడితే తమ కుటుంబాలను ఎలా పోషించుకోగలరని ఆవేదన వ్యక్తం చేశారు. గ్లౌజులు, సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. పై సమస్యల పరిష్కారానికి ఈనెల 27న జిల్లా కలెక్టరేట్ వద్ద జరుగు నిరసనలో గ్రీన్ అంబాసిడర్లు యావన్మంది పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సిల్లా పోలీస్, పి.తిరుపతి, కరుణాకర్, అబ్రహం, శంకర్రావు, రాము తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి 14 మేకలు మృతి

- బాధితునికి రూ. 50వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పుణ్యగిరి ఎంపిటిసి దార గిరికి చెందిన 14 మేకలు మంగళవారం రాత్రి పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. ఈ దుర్ఘటనతో రైతు ఆవేదనను తెలుసుకున్న ఎమ్మెల్సీ బుధవారం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడికి రూ.50 వేల సాయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ పశు సంపదే జీవనాధారమని ఈ ప్రాంతంలో చాలా మంది గిరిజన, హరిజన, వెనుకబడిన వర్గాల వారికి పశు సంపద ప్రధాన ఆదాయ వనరుగా ఉందని చెప్పారు. మేకలు, గొర్రెలకు సరైన బీమా సౌకర్యం లేకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సైక్లోన్ హెచ్చరికలు లేకపోతే బీమా వర్తించదని అధికారులు చెప్పగా, వాతావరణాన్ని అంచనా వేయడం కష్టం కాబట్టి ప్రతి దుర్ఘటననూ పరిశీలించి, నష్టపోయిన రైతులకు తక్షణమే న్యాయం జరిగేలా ప్రణాళిక చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సంతోషి, ఎంపిపి సోమేశ్వరరావు, గంగరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

గజపతినగరం: బొండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బోడసింగిపేట సమీపంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెల్లాన వేణు (29) అనే యువకుడు తీవ్రంగా గాయపడినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఆర్‌టిసి బస్సు బైక్ పై వెలుతున్న యువకుడుని ఢీ కొనడంతో గాయపడినట్లు తెలిపారు. గాయపడిన యువకుడిది రామభద్రపురం మండలం కొండ కెంగువ గ్రామం అని చెప్పారు. బంధువు ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గాడితప్పిన పురపాలనపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మున్సిపల్ పాలన గాడితప్పిందని, రెండు వారాలుగా పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా జరగడం లేదని, పట్టణ ప్రజల దాహం కేకలు వినాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. బుధవారం కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు, కోలా కిరణ్ కుమార్, తీళ్ల గౌరీ శంకరరావు తదితరులు జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డిని కలిసి పార్వతీపురం మున్సిపల్ ప్రజల తాగునీటి సమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారుగా గత రెండు వారాలుగా మున్సిపల్ కొళాయిల్లో తాగునీరు సరఫరాలేదన్నారు. దీంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ పాలన గాడి తప్పిందని, దానిపై ప్రత్యేక దృష్టి సారించి పురపాలనను గాడిలో పెట్టాలన్నారు. తాగునీటి సమస్యతో పాటు వీధి లైట్లు, పారిశుధ్యం, రోడ్లు, మురుగు కాలువలు, పందులు, కుక్కలు, ఆవులు, దోమలు, ఈగలు, సమస్యలు వేధిస్తున్నాయన్నారు. గ్రేడ్ వన్ మున్సిపాలిటీలో రెండు ఫాగింగ్ మిషన్లు ఉండగా ఒకటి మాత్రమే పనిచేస్తుందని, దోమల నివారణ చర్యలు శూన్యమన్నారు. తక్షణమే పురపాలను పెద్ద దృష్టి పెట్టి, ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న హెల్త్ కౌన్సిలర్ మురళీకృష్ణ

కెజిబివిలో మానసిక ఆరోగ్య వారోత్సవాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా మండలంలో బుధవారం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం కవిటిభద్ర, తాళ్లబురిడీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మానసిక ఆరోగ్యం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం నిర్వాహకులు, జిల్లా కెరీర్ అండ్ హెల్త్ కౌన్సిలర్ డాక్టర్ మురళీకృష్ణ విద్యార్థులు మానసిక ఆరోగ్యం ఎలా పెంచుకోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. మంచి ఆహారపు అలవాట్లు, యోగాసనాలు చేయడం ద్వారా మానసిక ఆరోగ్యం కాపాడుకోగలమని తెలిపారు. ప్రపంచ మానసిక ఆరోగ్యం పై జిల్లాలో అక్టోబర్ 10వ తేదీ వరకు వారోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుంధతి, కవిటిభద్ర కెజిబివి ప్రిన్సిపాల్ డి.మణి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ డిఇఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మి పురం

జియమ్మవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను జిల్లా ఉప విద్యాశాఖాధికారి జ్ఞానప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆయన పాఠశాలలో ఉన్న ఆర్ఒ ప్లాంట్ పరిస్థితి, పనితీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలలో గల మరుగుదొడ్లను పరిశీలించి పదో తరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలను నిశితంగా పరిశీలించి ఇప్పటి నుండే విద్యార్థులకు క్రమశిక్షణతో మరింత మంచి తర్ఫీదు ఇచ్చి ఈ పాఠశాలను ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయులు వావిలపల్లి ధనుంజయ నాయుడును ఆదేశించారు. ఈయన వెంట ఎంఇఒ పుష్పనాధం ఉన్నారు.



ట్యాబును పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ జ్ఞాన ప్రకాష్